



"ఏవండోయ్! మీ గురించి సుందరమూర్తిగారొచ్చారు. స్నానం వేగంగా కానివ్వండి" అది నా శ్రీమతి వర్తమానం.

'ఆదివారం పూటయినా మరో పది నిమిషాల సేపు హాయిగా స్నానం చేసుకోవడానికి వీలు లేకుండా పావకంలో పుడకలా ఇంత పొద్దున్నే వీడెందు కూడి పడ్డాడు చెప్మా?' స్వగతంలా అనుకుంటూ ఆఫీసున్న రోజుల్లో లాగానే ఆదరా బాదరాగా స్నానం కానిచ్చేసి బయట పడ్డాను.

సుందరమూర్తి, నేను ఒకే ఆఫీసులో పని చేస్తున్న వాళ్ళం. మా పరిచయం కేవలం ఆఫీసుదే కాదు. ఇంటర్ దాకా ఇద్దరం కలిసే చదువుకున్నాం. ఆ తరవాత వాడు టెక్నికల్ చదువుల కోసం పాలిటెక్నిక్‌కి నేను టైపు షార్ట్‌హాండ్ నేర్చుకోవడం కోసం టైపు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళిపోవడంతో అప్పుడు తాత్కాలికంగా మా దారులు విడిపోయాయ్.

ఆ విడిపోయిన దారులు కొంత కాలానికి ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాల వల్ల ఒక ప్రభుత్వ సంస్థలో మళ్ళీ కలిశాయ్.

ఆఫీసులో వాడు సూపర్‌వైజర్ గిరీని వెలగబెడుతూ ఇటు నెల జీతమే గాకుండా అటు ప్రైవేట్ ప్రైవేట్‌కూడా చేస్తూ రెండు చేతులా ఆర్జిస్తుంటే నేను మాత్రం ఒక ఎల్డీ గుమాస్తాగా రోజుల్ని ఏదోలా దొర్లించు కొచ్చేస్తున్నాను.

వాడికి ఆదివారాలు మిగతా సెలవు రోజుల్లోకూడా పాటిలే. ఈ రోజిలా ఇంత పెందరాళే పని కట్టుకు వచ్చాడంటే ఏదో విశేషం ఉండి ఉండాలి. విశేషాలు, కారణాలు అనేవి లేకుంటే వాడసలు నాకు కనిపించనే కనిపించడు. ఏ రేడియోనో లేక టేపురికార్డో పట్టుకుని దాని నడవడిని సరిదిద్దడానికి ప్రయత్నం చేస్తాడే తప్ప చాలా మందిలా సమయాన్ని వృధా పరిచే తత్వం కాదు తనది. కాలం చాలా విలువైనది వాడి దృష్టిలో.

వాడి చదువే కాదు బుర్రకూడా టెక్నికల్‌దే. ప్రతి విషయాన్ని టెక్నికల్‌గా ఆలోచిస్తాడు. అలానే ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తాడు

'అలాటి సుందర మూర్తికి నాతో పనేమిటబ్బా?!' అని మళ్ళీ స్వగతంలో ఆశ్చర్యపోతూ శ్రీమతి తెచ్చిన కాఫీని వాడికి ఇస్తూ, నేనో కప్పు తీసుకున్నాను.

కాఫీ త్రాగేసిన మరు క్షణమే తనొచ్చిన పని గురించి మూడు ముక్కల్లో వివరించాడు వాడు.

వాడి సుపుత్రుడు శ్రీను ఏడో క్లాసులో ఉన్నాడిప్పుడు.

పబ్లిక్ పరీక్షలు శ్రీనుకి చాలా దగ్గర్లో ఉన్నాయట.

శ్రీనుకి నాకున్న తీరుబడి సమయాల్లో ప్రయివేటు చెప్పి కనీసం పాసుమార్కులైనా వచ్చేట్లు చేయమని పదే పదే బ్రతిమాలుతున్నాడు వాడు.

ఒక మూడు నెలల్లో పబ్లిక్ పరీక్షలు అవుతాయ్.

ప్రయివేటు చెప్పి కుర్రాణ్ణి పాసయేట్లు చూడ్డానికి మూడు నెలలు చాలు. అయినప్పటికీ మూడు నెలలపాటు సాయంత్రాలన్నీ వృథా పరచుకోడాని కిష్టం లేక వాడి మాటని కాదంటూ ఒక ఉచిత సలహా పారేశాను.

"మనకు అందుబాటులో ఎన్నో ఏళ్ళ అనుభవాన్ని సంతరించుకున్న ట్యుటోరియల్ కాలేజీలున్నాయ్ కదా! అలాంటిచో టెక్కడైనా చేర్పించరాదూ?" అని.

వాడు నా సలహాని నవ్వుతూ కాదనేశాడు.

"ఆ మాత్రం ప్రయివేటుకి పంపించలేక కాదురా. ఎందుకో నాకు ఆ ప్రయివేట్ల మీద ప్రయివేటు మాస్టర్లమీద మంచి అభిప్రాయం లేదు. వాళ్ళ ధ్యాసంతా కేవలం డబ్బు చేసుకోవడం మీదే కాని పిల్లల భవిష్యత్తు మీద ఉండదని నా నమ్మకం. వాడి చదువు గురించి ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను. మొదట్లోనే నీ దగ్గరకు పంపించి ఉంటే ఇంత గాభరా ఉండేది కాదు నాకు. వాడు ఇంచుమించు అన్ని సబ్జెక్టుల్లోను వెనుకబడి ఉన్నాడు. అందుకని దయచేసి ఈ మూన్నెల్లూ శ్రమనుకోకుండా వాడికి నీవే ప్రయివేటు చెప్పాలి. నీ దగ్గరయితే వాడు పాసవుతాడన్న నమ్మకం నాకుంది" అంటూ నా చేతులు పట్టుకున్నాడు వాడు.

వాడు చెప్పిందాంట్లోనూ నిజం లేకపోలేదు. అలాని ప్రయివేట్లు చెప్పే వారంతా అలా ఉంటారనీ చెప్పలేను. సుందరమూర్తిలా ప్రత్యేకించి నా సహాయం అర్థించడంలో కారణం లేకపోలేదు. కిందటేడు మా ఆఫీసర్ మాట కాదనలేక సాయంత్రం పూట పదో క్లాసు రెండు సార్లూ తప్పిన వాళ్ళబ్బాయికి నేను ప్రయివేటు చెప్పడం ఆ కుర్రాడు ఫస్ట్ క్లాసులో పాసవడం జరిగింది.

అందుకే సుందరమూర్తికి నా మీదంత గురి. సుందరమూర్తి చదువులోను తెలివి తేటల్లోను నా కంటే ఒక నాలుగు మెట్లు మీదున్న వాడేఅయినప్పటికీ వాడికి ఇంచుమించు ప్రతి రోజూ ప్రైవేట్ ప్రైవేట్స్ గొడవ మూలంగా తన స్వంత కొడుక్కి కూడా పాఠాలు చెప్పుకోలేని పరిస్థితి వాడిది.

ఏడోక్లాసు పబ్లిక్ పరీక్ష కావడం వల్లా— పరీక్షలు చాలా దగ్గర్లో ఉండడంవల్లా—ముఖ్యంగా

మా పరిచయం ఆత్మీయతలవల్ల— నాకు చాలా దగ్గరి వాడై పోయాడు.

ప్రతి రోజూ సాయంత్రం ఆరు గంటల తర్వాత శ్రీనుకి ప్రయివేటు చెప్పడానికి ఫ్రీ ఆఫర్ ఇచ్చేశాను. వాడి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

"చాలా థాంక్స్‌రా నీకీ ట్రబుల్ ఇవ్వ దలచేవాణ్ణి కాదు. మావాడు చదువుతున్న స్కూలుకీ మర్యా రిజల్ట్స్ చాలా పూర్‌గా వస్తున్నాయ్. అందువల్ల ఏటీచర్స్ స్టాండర్డ్ లేదు. అందుకనే సంవత్సరానికి మించిపోయిన మూడు నెలలూ నీకీ శ్రమివ్వక తప్పడం లేదు" అంటూ వాడు నవ్వేశాడు.

మరునాటి రోజు నుంచి శ్రీను నా దగ్గరికి రాసాగాడు. అప్పుడే స్కూల్స్ తెరచి ఆరు నెలలు కావస్తున్నా — మూడొంతుల పాఠాలు ప్రతి సబ్జెక్టులోనూ అయిపోయినా శ్రీను మాత్రం సుందరమూర్తి చెప్పినట్లే అన్నింట్లోనూ చాలా వెనకబడి ఉన్నాడు.

కారణం ఒకటేనని స్ఫురించింది కాదు నాకు. క్లాసుల్లో ఒక్కో తరగతికీ మూడేసి సెక్షన్లు—అర వందేసి పిల్లలుండటం—అందరినీ మాస్టర్లు శ్రద్ధ తీసుకోలేకపోవడం —కొందరు మాస్టర్లు పట్టించుకోకపోవటం మూలంగానే శ్రీనులాంటి వాళ్ళు చదువులో వెనకబడి ఉండడానికి కారణాలై ఉండొచ్చు? ముఖ్యంగా శ్రీను లెక్కలు—సైన్సులో మరీ వెనకబడి ఉన్నాడు. మంచి మార్కులు రాక పోయినా, కనీసం పాసు మార్కులైనా రావాలంటే—స్కూల్లో అయిన ప్రతి పాఠాన్నీ మళ్ళీ మొదట్నుంచీ తన బుర్రలోకి ఎక్కిస్తేగాని లాభం లేదు.

పదిహేను రోజులు ముందుకు జరిగాయ్. నా ప్రయత్నాలేవో లోపరహితంగా చేస్తున్నంతలో అనుకోని అవాంతరం వచ్చి పడింది.

మా ఆఫీసువాళ్ళ ప్రావిడెంట్‌ఫండ్ లెక్కలు ఎకౌంట్లు తనిఖీ చేయడం కోసం ఒకనెల రోజులు పాటు కొంతమంది మా ఆఫీసు మిత్రులతోపాటు నే కూడా హైదరాబాద్ సెక్రటేరియట్‌కి వెళ్ళ వలసిరావడంతో సుందరమూర్తికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండలేకపోయాను.

క్యాంపు అయిపోయిందనుకుంటే— మా చెల్లాయికి పెళ్ళి సంబంధం కుదరడం—ఆ హడావుడంతా సవ్యంగా జరిగి పోవడానికి ఒకనెల్లాళ్ళు సెలవు మీద మా వూరికి వెళ్ళి పోవడంతో శ్రీను సంగతి పూర్తిగా మరచిపోవటమైంది కాదు.

నా పనులన్నీ పూర్తయి తేలిగ్గా వూపిరి పీల్చుకునే సరికి ఏవో తరగతి పరీక్షలు కాస్తా అయిపోయాయి.

కొన్ని కొన్ని స్కూళ్ళలో పరీక్షా పత్రాలు పరీక్షలకు ముందే తెలిసిపోవడం—కొన్ని పేపర్లు వార్తా పత్రికల్లో పరీక్షలు జరగడానికి ముందే ప్రచురించబడినా మళ్ళీ పరీక్షలు జరగక పోవడంవల్ల విద్యార్థులతోపాటు —తల్లిదండ్రులూ సంతోషించారు.

నాకు మాత్రం ఇలా జరగడం అంత బాగా లేదనిపించింది. ఇలాంటి చదువులు రేపటి భావి పౌరులకు ఎంతవరకు సహాయకారి కాగలవని—

**పసిప్రతి**

హృదయం కల్మషం లేనిదైతే, అది చూపులలోనే ప్రతిఫలిస్తుంది.

— ఉపనిషత్

అనుకోకుండా,ఆలోచించకుండా ఉండలేక పోయాను.

నేను ఆఫీసులో చేరి పదిహేను ఇరవై రోజులవుతున్నప్పటికీ సుందరమూర్తిని కలుసుకోవడం వీలు పడలేదు.

ఏవో తరగతి పరీక్షా ఫలితాలు కూడా వచ్చేశాయి. అప్పుడు శ్రీను పరీక్ష సంగతి గుర్తొచ్చింది.

'సుందరమూర్తి కనిపించినా బావుణ్ణు; శ్రీను పరీక్ష సంగతి తెల్సేది.' స్వగతంలా అనుకున్నాను.

కొన్ని రోజులు ఎదురు చూసి ఎదురు చూసి వాడి ఆఫీసుకే ఫోన్ చేసి మాట్లాడితే చాలా తేలిగ్గా నవ్వుతూ శ్రీను విషయం గర్వంగా తెలియచేశాడు నాకు.

శ్రీను పాసయ్యాడట

మామూలు పాస్ కాదు.

ఫస్ట్ క్లాసులో మరీ పాసయ్యాడట.

వట్టి క్లాసే కాదు.

వాళ్ళ స్కూలుకే ఫస్టొచ్చాడట!

అందుకే వాడంత గర్వంగా చెప్పాడు నాకు.

ఏ తండ్రికి మాత్రం తన కొడుకు కొన్ని వందల మంది విద్యార్థులందరి కంటే ప్రప్రథముడుగా పాసవడం సంతోషం కలిగించదు? అందుకే ఫోనులో అభినందనలు తెలియజేశాను.

"మొద్దబ్బోడ్ అనుకున్నాను గాని—మావాడు నిజంగా తెలివైనవాడేరా!" అంటూ మరోసారి కొడుకు గొప్పని తలచుకుంటూ సంబరపడ్డాడు మూర్తి

శ్రీను సాధించిన విజయం గురించి మా వాడు స్వయంగా నాతో చెప్పినప్పటికీ నా కెందుకో నమ్మశక్యంగాకుండా ఉంది. కారణం ఫలానా అని చెప్పలేను కాని ఇంచుమించు ఒక రెండు వారాలు శ్రీను చదువు సంగతి తెలివి తేటల గురించి అనుభవం మీద తెలుసుకున్న నేను ఇంకా ఆశ్చర్యంలో కొట్టుకు పోతూనే ఉన్నాను

మామూలుగా పాసయ్యేంటే ఇంతగా ఆశ్చర్యపడేవాణ్ణి కాదు. కుర్రాడు ఆఖరిలో కష్టపడి చదివి ఉంటాడని అనుకునేవాణ్ణి. లెక్కలు,సైన్సుల్లో మూల సూత్రాలుకూడా రాని శ్రీను స్కూలుకే ఫస్ట్ వచ్చాడంటే ఏదో అద్భుతం జరిగే ఉండాలి. . . లేకుంటే ఎలా సాధ్యం?. . .

సుందరమూర్తిని అడిగితే నా సందేహానికి సమాధానం దొరికితే దొరకొచ్చు కాని అలా అడగడం సభ్యత కాదని వూరుకున్నాను.

ఎంత స్నేహితుడైనా 'ఒరే! శ్రీనుకి ఫస్ట్ క్లాసు వచ్చిందంటే నే నమ్మలేక పోతున్నారా?' అంటే వాడు చిన్నబుచ్చుకోడూ?

అందుకనే నా ఆశ్చర్యం నా లోనే ఉండిపోయింది.

ఆ మరునాటి రోజు నా వాడితో కలిసి పని చేస్తున్న అసిస్టెంటు మాస్టర్లలో ఒకరు కృష్ణ ద్వారా నా సందేహం నివృత్తి అయినప్పటికీ ఎప్పటికీ తీర్చలేని మనో వ్యధ సందేహం కొండంత దిగులు, బాధ నాలో మిగిలాయి.

నా దిగులు నా గురించి కాదు.

నా బాధ నా గురించి అసలు కానే కాదు.

మరెవరి కోసం?

కృష్ణ చెప్పిన కథనం తెలిస్తే నాలోని బాధ దిగులు ఎవరికోసమో మీకే తెలుస్తుంది.

కృష్ణ చెప్పిన కథనం ఇది.

శ్రీను స్కూలుకి రిజల్ట్స్ బాగా రాకపోవడం వల్ల ఆ స్కూలుకి స్కూలు మాస్టర్లకి గుర్తింపు లేకుండా ఉందని సుందరమూర్తే ఒకప్పుడు చెప్పాడు

ఎక్కడా సీటు దొరక్క పోతేనే చేసేదేమీ లేక తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఆస్కూల్లో చేర్పిస్తున్నారన్న విషయం చాలా మందికి తెలియని విషయమేమీ కాదట.

పరీక్షలకి ముందే పరీక్షా పత్రాలు పిల్లలకి తెలిసిపోవడం కొన్ని ప్రశ్నా పత్రాలు మళ్ళీ మారి పోవడం,మరి కొన్నివారికందకుండా తెలిసిపోయిన ప్రశ్నా పత్రాలే రావడం వల్ల మిగతా పబ్లిక్ పరీక్షల్లా కాకుండా ఏడో తరగతికి ఏ స్కూలు పిల్లలు ఆ స్కూల్లోనే పరీక్షలు రాసేవిధానం వల్లా ఆ స్కూలు మాస్టర్లు తమ విద్యార్థుల బాగు కోసం ఒక మంచి నిర్ణయం తీసుకున్నారట.

ఆ నిర్ణయం ప్రకారం పరీక్షలుజరుగుతున్నప్పుడు పిల్లలు అడక్క పోయినా పెద్ద పెద్ద ప్రశ్నల దగ్గర నుంచి బిట్స్‌కికూడా సమాధానాలు పిల్లల చెవుల్లో వూదడం పిల్లలు ఇనుమడించిన ఉత్సాహంతో చకచకా పరీక్షలు రాయడం జరిగిందట. అలా జరగడం వల్ల విద్యార్థులు తలి దండ్రులూ ఎంతో సంతోషించారట. ఈ సారి నూటికి ఎనభై మంది పాసవడం వల్ల ఉపాధ్యాయు లంతా సంతోషించారట.

అలాంటి మేడ్ ఈజీ పరీక్షల వల్లే శ్రీను, శ్రీను లాంటి ఎంతో మంది విద్యార్థులు వట్టి పాసే గాకుండా ఫస్ట్ క్లాసులో మరీ పాసయ్యారట.

తమ పిల్లలు బ్రహ్మాండంగా పాసయ్యారని ఇటు తలి దండ్రులు అటు ఉపాధ్యాయులు ఎంతో సంబర పడుతున్నారే కాని వారంతా నా లాంటి దృక్పథంతో ఆలోచించి చూస్తే వారి సంబరం కొన్ని క్షణాల్లో రెక్కలు కట్టుకుని పలాయనం చిత్తగించదూ?

అలాంటి పద్ధతిలో భావి పథం వేపు అనాయాసంగా సాగిపోతున్న మరలించబడుతున్న విద్యార్థులకి మంచి జరిగిందా? కీడు జరుగుతోందా? భవిష్యత్పునాదులు పటిష్ఠంగా వేయబడుతున్నవా? లేక వేస్తున్న పునాదులు వట్టి గుల్ల పునాదులేనా?. . . వారి బతుకుల్ని తడబడేట్టు సత్యం తెలిసి పెద్దవాళ్ళే చేస్తున్నారా?.. అని ఆలోచించి బాధ పడే నాలాంటి కొన్ని వందల మంది తల్లి దండ్రుల్లోను. . . ఉపాధ్యాయుల్లోను ఒక్కరంటే ఒక్కరు లేక పోవడం నిజంగా శోచనీయం.

నా ఆలోచనలు పొరపాట్లు తప్పనుకుంటే ఏం చేస్తే బాగుంటుందో కాస్త మీరైనా చెప్పండి.

★